# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 30-09-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

❖ రాష్ట్రంలో అక్టోబర్ 15వ తేదీ నుంచి పూర్తి స్థాయిలో ఇసుక అందుబాటులో ఉంటుందని గనులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు.

❖ నేటి యువత భారతీయ తత్వశాస్త్ర విజ్ఞానానికి వారసులుగా ఎదగాలని పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు ఆకాంక్షించారు.

❖ పేదల సేవలో పేరిట "ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల" పంపిణీ రాష్ట్రంలో రేపు ప్రారంభం కానుంది.

❖ ప్రజల సమస్యలను అధికారులు దృష్టిలో పెట్టుకుని సత్వర పరిష్కారాలకు కృషి చేయాలని మంత్రి గుమ్మడి సంధ్యా రాణి అన్నారు.

❖ రాష్ట్ర ప్రభుత్వం "నైపుణ్య గణన" పైలెట్ ప్రాజెక్టును ఈరోజు గుంటూరు జిల్లా మంగళగిరి నియోజకవర్గంలో చేపట్టింది.

=====================

పేదలందరికీ ఉచితంగా ఇసుక అందిస్తామని, త్వరలోనే ఇసుక సమస్యలు పరిష్కారమవుతాయని రాష్ట్ర గనులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. అక్టోబర్ 15వ తేదీ నుంచి పూర్తి స్థాయిలో ఇసుక అందుబాటులో ఉంటుందని ఈరోజు ఆయన పాత్రికేయులకు వెల్లడించారు. వర్షాకాలంలో వరదల దృష్ట్యా ఇసుక తవ్వకూడదనే జాతీయ హరిత ట్రిబ్యూనల్ (ఎన్జీటీ) ఆదేశాల మేరకు ఇసుక రీచుల్ని నిలిపివేశామన్నారు. అక్టోబర్ 15 నుంచి ఇసుక రీచుల్ని ప్రారంభించి, బోట్ మెన్ సొసైటీలు, పట్టా భూముల్లో కూడా ఇసుక తవ్వకాలను చేపడతామన్నారు. దూర ప్రాంతాలకు రవాణా ఛార్జీలు అధికమవుతున్నాయనే సమస్యనూ త్వరలో పరిష్కరిస్తామని మంత్రి తెలిపారు.

=====================

భారతీయ తత్వశాస్త్ర వైభవాన్ని ప్రపంచానికి ఛాటి చెప్పిన ఆధునిక ఋషి కొత్త సచ్చిదానందమూర్తి అని పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు అన్నారు. గుంటూరు జిల్లాలోని నంబూరులో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఈరోజు నిర్వహించిన ఆచార్య కొత్త సచ్చిదానందమూర్తి శత జయంతి ఉత్సవాల సందర్భంగా రెండు రోజుల జాతీయ సదస్సును వెంకయ్య నాయుడు ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ, సచ్చిదానందమూర్తి స్ఫూర్తితో నేటి యువతరం భారతీయ తత్వశాస్త్ర విజ్ఞానానికి వారసులుగా ఎదగాలని ఆకాంక్షించారు. సాధారణ రైతు కుటుంబంలో పుట్టిన ఆయన ప్రపంచస్థాయికి ఎదగటానికి ఎంతో కృషి చేశారని వెంకయ్యనాయుడు పేర్కొంటూ....

(వాయిస్ 32 సెకన్లు)

=====================

"పేదల సేవలో" పేరిట "ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ" రాష్ట్రంలో రేపు ప్రారంభం కానుంది. కర్నూలు జిల్లా పత్తికొండ నియోజకవర్గంలోని పుచ్చకాయలమడ గ్రామంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ కార్యక్రమంలో రేపు స్వయంగా పాల్గొని లబ్ధిదారులకు పించన్లు అందించనున్నారు. అలాగే అక్టోబర్ 1వ తేదీన గ్రామాలలో పింఛనుదారులు అందుబాటులో ఉండి పింఛన్లు పొందాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఏ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. రేపు నూరు శాతం పింఛన్లు పంపిణీ పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. లబ్ధిదారుల ఇంటి వద్దకే సచివాలయ సిబ్బంది ద్వారా పింఛన్ల పంపిణీ జరుగుతుందని చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఈరోజు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 2 లక్షల 69 వేల 677 మందికి సుమారు 113.77 కోట్ల రూపాయలను పంపిణీ చేయనున్నామని తెలిపారు. అక్టోబర్ 1, 3వ తేదీలలో మాత్రమే పంపిణీ చేయడం జరుగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు.

=====================

ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఈరోజు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించారు. అందులో భాగంగా ఈరోజు పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా స్థాయి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యా రాణి పాల్గొన్నారు. గ్రామాలలో ఉన్నట్టువంటి ప్రజల సమస్యలను అధికారులు దృష్టిలో పెట్టుకుని సత్వర పరిష్కారాల కోసం ఈ వేదిక ఏర్పాటు చేయడం జరిగిందని మంత్రి వివరించారు. కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్, పార్వతీపురం సబ్ కలెక్టర్ మరియు ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి అశుతోష్ శ్రీవాస్తవ లతో కలిసి ప్రజల నుంచి 238 వినతులను స్వీకరించారు. "జల్ జీవన్ మిషన్" క్రింద అన్ని గ్రామాల్లో ఇంటింటికీ కుళాయి కనెక్షన్లు అందించాలని గ్రామీణ నీటి సరఫరా విభాగానికి మంత్రి సూచించారు. ఫిర్యాదులను సంబంధిత అధికారులకు అప్పగించి సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు.

=====================

ఇటీవల రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిన "నైపుణ్య గణనను ప్రయోగాత్మకంగా ఈరోజు గుంటూరు జిల్లా మంగళగిరి నియోజకవర్గంలో ప్రారంభించారు. నైపుణ్యాభివృద్ధి కార్పొరేషన్, మంగళగిరి నగర పాలక సంస్థ అధికారులు ఈ నైపుణ్య గణన కార్యక్రమంలో పాల్గొన్నారు. మంగళగిరి అర్బన్ మండలం, తాడేపల్లి, దుగ్గిరాల, రాజధాని ప్రాంతంలోని 16 గ్రామాలను 5 క్లస్టర్లుగా విభజించి, మొత్తం లక్షా 61 వేల 421 కుటుంబాల సమాచారాన్ని సేకరిస్తున్నామని అధికారులు వెల్లడించారు.

విరామం

=====================

రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ ఈరోజు వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరులో పర్యటించారు. కడప రిమ్స్ ప్రాంగణంలోని ప్రభుత్వ దంత వైద్య కళాశాలలో 14 లక్షల రూపాయలతో అభివృద్ధి చేసిన మినీ ఆడిటోరియం, ఎమర్జెన్సీ

డెంటల్ క్లినిక్, అలాగే సెంట్రల్ ల్యాబ్ లో 2 లక్షల రూపాయలతో ఏర్పాటు చేసిన అధునాతన పరికరాలను మంత్రి ఈ రోజు ప్రారంభించారు.

=====================

సముద్రంలో చేపలవేటకు వెళ్లే మత్స్యకారులకు బహుళప్ర యోజనకారిగా ఉపయోగపడే అత్యాధునిక సమాచార వ్యవస్థను కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టడంపై విశాఖ పార్లమెంటు సభ్యుడు శ్రీ భరత్ హర్షం వ్యక్తం చేశారు. ఈ రోజు విశాఖలో పాత్రికేయులతో మాట్లాడుతూ... దేశవ్యాప్తంగా 26వేల మత్స్యకార మర పడవులకు వెసెల్ కమ్యూనికేషన్ సిస్టం పరికరాలను అమర్చుతున్న తరుణంలో విశాఖ ఫిషింగ్ హార్బర్ లో 500 మరబోట్లకు ఈ వ్యవస్థను అందుబాటులోకి తీసుకువచ్చారన్నారు. కేంద్ర ప్రభుత్వం సహకారంతో అవాటెల్ సంస్థ ప్రాయోజకత్వంలో 70 వేల రూపాయలు ఖరీదు చేసే ఒక్కో పరికారాన్ని మత్స్యకారులకు ఉచితంగా అందించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. తుఫాను సమయంలో ఈ కమ్యూనికేషన్ వ్యవస్థ మత్స్యకారులకు ఎంతో ఉపయోగపడుతుందని, అలాగే సముద్రంలో మత్స్య సంపద ఎక్కువగా వుండే ప్రదేశాలపై సమాచారం అందిస్తుందని ఆయన పేర్కొంటూ....

(వాయిస్ 31 సెకన్లు)

=====================

ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజవర్గాల పరిధిలో ఓటర్ల నమోదుకు ఎన్నికల సంఘం (ఈసీ) నోటిఫికేషన్ జారీ చేసింది. అక్టోబరు 1 నుంచి నవంబరు 6 వరకు ఈ జిల్లాల పరిధిలో పట్టభద్రులైన ఓటర్ల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఫాం-18 ద్వారా ఓటర్లుగా నమోదు చేసుకోవాలని ఎన్నికల సంఘం సూచించింది. నవంబర్ 23వ తేదీన ఓటర్ల జాబితా ముసాయిదాను ప్రకటించనున్నారు. డిసెంబర్ 9 వరకు అభ్యంతరాలను స్వీకరించి.. అదే నెల 30వ తేదీన తుది జాబితాను వెల్లడించనున్నారు.

=====================

పిల్లలు ఆరోగ్యంగా ఉంటేనే దేశం బాగుంటుందని పార్వతీపురం శాసన సభ్యులు బోనెల విజయ్ చంద్ర అన్నారు. ఈరోజు పార్వతీపురం మండలం పెద్దబొండపల్లి గ్రామంలో సాక్షం అంగన్వాడీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పిల్లలు పౌష్టికాహార లోపానికి గురి కాకుండా ఉండాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మంచి పౌష్టికాహారం అందిస్తున్నాయని తెలిపారు. పరిసరాలు శుభ్రంగా ఉండాలని, మంచి స్వచ్ఛమైన తాగునీరు అందించాలని, పిల్లల మనోవికాసానికి అవసరమైన సామాగ్రి అందించడం వంటి కార్యక్రమాలపై ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. మహిళలు చైతన్యవంతులైతేనే అభివృద్ధి సాధ్యపడుతుందని ఆయన పేర్కొన్నారు.

=====================

పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యం కలిగిన యువతను అందించేలా కృషి చేస్తామని ఆంధ్రప్రదేశ్ ఉపాధి కల్పన, వ్యవస్థాపన అభివృద్ధి సంస్థ (సీడ్ యాప్) నూతన చైర్మన్ దీపక్ రెడ్డి గుణపాటి తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడలో సీడ్ యాప్ నూతన చైర్మన్ గా ప్రమాణ స్వీకారం చేసిన ఆయన ఆంధ్రప్రదేశ్ ఉపాధి కల్పన, వ్యవస్థాపన అభివృద్ధి సంస్థ కార్యాలయం లో చైర్మన్ గా ఈ రోజు పదవీ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ... ఉపాధి కల్పన దిశగా కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుంటామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చేపడుతున్న పథకాలకు ఎటువంటి నిధుల కొరత లేకుండా కృషి చేస్తామని తెలిపారు.

=====================

రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాల్లో ఉన్న నైపుణ్యం కలిగిన క్రీడాకారులను అన్ని విధాలుగా ప్రోత్సహిస్తామని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్) చైర్మన్ రవి నాయుడు అన్నారు. శాప్ చైర్మన్ గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత మొదటిసారి ఈరోజు తిరుపతికి చేరుకున్న ఆయనకు కూటమి నేతలు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా

పాత్రికేయులతో ఆయన మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ లో వున్న క్రీడాకారులు కోసం ప్రధాన ప్రాంతాల్లో స్పోర్ట్స్ కాంప్లెక్స్ లను ఏర్పాటు చేస్తామని తెలిపారు. రాష్ట్రం నుంచి రాణిస్తున్న క్రీడాకారులను ప్రోత్సహించి, వారు మిగిలిన రాష్ట్రాలకు వెళ్లి తమ నైపుణ్యాన్ని ప్రదర్శించుకునే అవకాశం ప్రభుత్వం కల్పిస్తుందన్నారు.

======================

తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి సాలకట్ల బ్రహ్మోత్సవాలకు తిరుపతికి చెందిన భక్తుడు పరదాల మణి ప్రత్యేకంగా పరదాలు, కురాళాలు సిద్ధం చేశారు. వెంకటేశ్వర స్వామి, శ్రీదేవి, భూదేవి, వెంకటేశ్వర స్వామి తల్లి వకుళ మాత ఇలా దేవతామూర్తులు అందరూ కనిపించేలా పరదాలను సిద్ధం చేసి తిరుమలకు తీసుకెళుతున్నామని ఆయన పాత్రికేయులకు వెల్లడించారు.

======================

======================